# పవన పుత్ర ప్రసాద్

ప్రపంచంలో ఎక్కడయినా వేగంగా వెళ్ళే కార్లకు, ఇతరవాహనాలకు, వేగంగా పరుగెత్తే మృగాల లేక పక్షుల లేక దేవుళ్ళ పేర్లు పెడుతుంటారు. స్వతంత్ర భారతంలో మొట్టమొదట తయారు చేసిన కార్లలో ఒకటి 'హిందుస్థాన్' ఎంతో దేశప్రేమ ఉన్న దాని నిర్మాతలకు ఈ దేశం పురోగతి మీద ఉన్న అభిమానం వల్లనే దేశప్రగతి వేగాన్ని ప్రతిబింబించే కార్లను, తయారు చేసి ఆ చతుశ్చక్రీలకు 'హిందూస్థాన్' అన్న పేరు పెట్టారు. కొంతకాలం తర్వాత విదేశాల్లో పోస్టింగ్ రాగానే అక్కడికి, అక్కడేదైనా సమస్యలు ఉద్రిక్తంకాగానే తిరిగి స్వదేశానికీ ఎంతోవేగంతో ప్రయాణం చేసే రాయబారుల్ని నమూనాగా తీసుకొని కాబోలు అదే నిర్మాతలు 'హిందూస్థాన్' కారుకు 'ఎంబాసిడర్' అన్న పేరును మార్చారు. ఇంకో కంపెనీ తమ కార్ల గురించి గొప్ప అభిప్రాయం ఏమీ లేకపోవడం వల్ల వాటికి 'స్టాండర్డ్' అని పేరు పెట్టింది.

ఎద్దుల బళ్ళు ఎక్కువగా ఉన్న ఈ దేశంలో కార్లు ఒక మాదిరి మామూలు వేగంతో పరుగెత్తితే చాలుకదా! స్టాండర్డ్ కార్లకు ముందు ఒక్కొక్క నంబరు ఇచ్చింతర్వాత 'హెరాల్డ్ అనీటా గెసెల్' అన్న మంచి పేర్లు కూడ కలపడం జరిగింది. 'గెసెల్' అన్న ఇంగ్లీషు పదానికి మంచివేగం ఉన్న దుప్పి అని అర్థం. భారతదేశంలో ఉన్న ఇంకో కంపెనీ 'ఫియట్' అని ఇంతవరకు ఒక్కకారైనా కొనలేని వాళ్ళకు కూడ తెలుసు. కానీ అది భారతీయ నామధేయం కాకపోవడం వల్ల వాళ్ళ కొత్తకారుకు 'ప్రీమియర్ ప్రెసిడెంట్' అని పేరుంచారు. అందరి కంటె ముందుండాలని 'ప్రెసిడెంట్' అని పేరుంచారు. అందరికంటె ముందుండాలని 'ప్రెసిడెంట్'కు కోరిక ఉన్నా అందుకు వేగంగా పరుగెత్తి అన్నింటిని దాటాలి కదా! అందుకే

ఆ 'ప్రెసిడెంట్' కు కూడ ప్రీమియర్ అనే విశేషణం ముందుంచడం జరిగింది. ఈ దేశంలో పురుషుల కంటె స్త్రీలకే ఎక్కువ స్పీడని తెలుసుకుని ఆ ప్రెసిడెంట్ పదాన్ని 'నిష్కాసనం' చేసి 'పద్మిని'ని 'స్థానారోహణం' చేయించారు. ఈ రోజుల్లో 'డోబర్‌మాన్' అనే కుక్క, 'మారుతి' అనే ఒక కారు లేని ఇల్లు లేదని ఇవి రెండూ లేని మనుషులు అంటారు.

ట్యూబ్‌లోంచి గాని బెలూన్‌లోంచి గాని బైటికి పోయేగాలిని స్ఫురింప జేసే 'సూ..సూ..కీ' అన్న జపాన్‌వాళ్ళ పేరును భారతీకరణం జేసి దానికి 'మారుతి' అని పెట్టిన పేరు వాయు దేవునికి బాగా నచ్చింది. వాయువేగంలో పరుగెత్తే ఆ కారులో ప్రయాణం చేసే వారి గాలి పోవడానికి అది ఒక సైకిల్‌ను తాకితే చాలు. కార్ల విషయం అది.

బస్సులు, లారీల విషయం తీసుకొంటే ఎక్కువగా కనిపించేవి టాటాలు, లీలాండ్‌లే, టాటా' కుటుంబం అందరికీ తెలిసిందే. బండిలో వెళ్ళేటప్పుడు టా....టా... అని అందరూ ఎందుకు అంటారు? ఇంకోదానికి లీలాండ్ అని ఎందుకు పేరు పెట్టారు అర్థం కావడం లేదు. 'లీ' అనే ఇంగ్లీషు పదానికి 'పచ్చిక బీడు' అని అర్థం. అందుకే 'లీ' పదంలో లాండ్' అనే పదం కూడ కలిసి ఉంది. మరి ఎందుకు లీకి లాండ్‌ను అదనంగా కలిపినట్లు?

ఆ విధంగా పెద్ద బస్సులకు లేదా లారీలకు పెట్టిన పేర్లల్లో స్పీడు ఎక్కువగా ఉన్న మృగం పేరుగాని మనిషి పేరుగాని ఉన్నట్లు కనిపించడంలేదు. కానీ, డ్రైవర్ల సూచన కోసం ఫలానా స్పీడు కంటె ఎక్కువగా పోకూడదని రాసి పెట్టినా, అది వాళ్ళకు అర్థం కాకాపోవడం వల్ల కాబోలు వాళ్ళెప్పుడూ ఆ స్పీడుకంటె ఎక్కువగానే నడుపుతుంటారు. అలాంటి పెద్ద వాహనాలను అంత స్పీడుగా నడపడం వల్ల ఒక ప్రయోజనం మాల్థస్ జనాభా సిద్ధాంతంలో పేర్కొన్న జనాభా సహజ నియంత్రణ నియమాలలో ఒకటి ఆటోమాటిక్‌గా అమలు జరగడం. అతివేగంగా పరుగెత్తుతూ పరుగెత్తుతూ అప్పుడప్పుడూ చెరువుల్లో గాని, నదుల్లో గాని దూకుతున్నపుడు మాల్థస్ మందహాసం చేస్తుంటాడు లేక అట్టహాసం చేస్తుంటాడా అని ఆ సిద్ధాంతం చదువుకున్న వాళ్ళకు న్యాయమైన ఒక అనుమానం కలిగితే తప్పులేదు. ఇలాంటి బృహద్వాహనాలను పెద్ద సంఖ్యలో వాడేసంస్థలు ఆయారాష్ట్రాల్లోని రోడ్డు రవాణా సంస్థలు. ఆంధ్రప్రదేశ్ రోడ్డురవాణా సంస్థలో ఇలాంటివి వేలాది బస్సులున్నాయి. ఈ వాహనాలకు వేగాన్ని సూచించే పేర్లయితే పెట్టలేదుగాని ఈ కార్పొరేషన్‌కు శీఘ్రతకు మారుపేరయిన మారుతి, హనుమంతుడు, హనుమంతుడి భక్తికి పాత్రుడయిన శ్రీరాముడు మొదలయిన వాళ్ళతో అవిభాజ్య సంబంధముందని ఎవరయినా ప్రస్తావిస్తే ఆ కార్పొరేషన్ పూర్వ, ప్రస్తుత చరిత్రలు తెలిసిన వారు తప్పకుండా అంగీకరిస్తారు.

ఈ బస్సులో ప్రయాణించే యాత్రికుల్లో కూడ వాయువు పేరుగాని, వాయుపుత్ర

నామధేయం గాని, వాయుపుత్రదేవుని పర్యాయనామాలు గాని ఉన్న వాళ్ళుకోకొల్లలుగా ఉంటారు. మొత్తం దేశంలో ఉన్న రోడ్డురవాణా సంస్థలలో మన సంస్థ అన్ని విషయాల్లో ముందుకే ఉంది. ఇలాంటి పెద్ద సంస్థలు గురుతరమైన నష్టాల్లో నడుస్తున్నా ఎపియస్ ఆర్‌టిసి మాత్రం జాతీయస్థాయిలో గొప్పగొప్ప అవార్డులను పొందుతోంది. ఆంధ్ర ప్రదేశ్‌లో కూడ జిల్లా సర్వీసుల్లో సాధారణంగా లాభం కనిపిస్తూనే ఉంటుంది కానీ సిటీ సర్వీసులో నష్టం రాకుండా ఉండడం అసంభవమైన విషయం.

హైదరాబాద్ సిటీ సర్వీసు అయితే ఎక్కువగా నష్టంలోనే నడుస్తుంటుంది. దానికి బస్‌పాసుల్తో తిరిగే వాళ్ళు ఎక్కువగా ఉండడం ఒక కారణం. డబుల్ డెక్కర్ బస్సులు నడపడం మరోకారణం. అలాంటి పైకి చెప్పదగిన కారణాలు మరికొన్నిఉండవచ్చు. కానీ మన కథానాయకుడికి ఈ సిటీ సర్వీసుకు ఉన్న సంబంధమేమిటని వాహనాల చరిత్ర, భూగోళశాస్త్రం ఇంతవరకు చదివి విసుగు పుట్టిన పాఠకులకు సందేహం కలగవచ్చు. కానీ ఏంచేయాలి ? ఇప్పుడే కథ మొదలయింది.

వనస్థలిపురంలో నివసించే వరుణలక్ష్మి, మారుతీ రామారావు దంపతులకు కాలేజీలో చదువుతున్న ఇద్దరు కొడుకులున్నారు. పెద్దవాడు నిజాం కాలేజీలో బి.కాం మూడో సంవత్సరం చదువు తున్నాడు. పవన పుత్రప్రసాద్ అనే పందొమ్మిదేళ్ళ ఆకుర్రవాడు గాలికి ఉన్ముఖంగా గానీ, అభిముఖంగా గానీ తన ఇష్ట ప్రకారం పరుగెత్తుతుండేవాడు. అతను కాలేజీకి వెళ్ళాలంటే రెండు బస్సు లెక్కాలి. కానీ సిటీమొత్తం తిరగడానికి బస్సుపాసు ఉండడం వల్ల అతను ఏ సమయంలో ఎక్కడ ఉంటాడో చెప్పడం కష్టం. రెండోవాడు వరుణ ప్రసాద్. అతను సికింద్రాబాద్‌లో ఒక జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. డాక్టరు కావాలన్న కోరికతో అతను కష్టపడి చదువుతున్నాడు. అతను ఇంటినుంచి కాలేజీకి, కాలేజినుంచి ఇంటికి సరాసరి ప్రయాణిస్తాడు.

అనేక రాష్ట్రాల ఆర్‌టిసిలలో సిటీ సర్వీసుల్లో ఇష్టం వచ్చినట్లు ప్రయాణం చేయడానికి ఒకరోజు పాసులు, ఒక మాసం పాసులు ఇస్తుంటారు. విద్యార్థి పాసులకు ధర తక్కువ కూడా. పనీ, పాటాలేని కొందరు ఒకరోజు పాసు కొనుక్కుని తిండి, నిద్రలను కూడ త్యాగం చేసి పొద్దున్నే ఫస్టు సర్వీసులో ఎక్కి రాత్రి లాస్టు సర్వీసు వరకు తిరిగి తిరిగి తాము పెట్టిన డబ్బుకు పదింతలు గాని, ఇరవైరెట్లు గాని లాభం పొందామని తెచ్చుకున్న ఒంటినొప్పితో సహా సంతోషిస్తారు. మన పవన పుత్ర ప్రసాద్‌కు కూడ దాదాపు అలాంటిదే ఒక మనోవైకల్యం ఉండడం వల్ల కాలేజీ ఎగ్గొట్టి కూడ అతను అప్పుడప్పుడు అటూ ఇటూ ప్రయాణం చేస్తుంటాడు. కానీ ఎప్పుడూ అతను ఒంటరిగా తిరగడు. అతనికి తోడుగా ఎప్పుడూ కొందరు స్నేహితులుంటారు. మద్యపానం, సిగరెట్ కాల్చడం, సినిమాలకు

వెళ్లడం, అమ్మాయిలను ఏడిపించడం వంటి అలవాట్లు మగపిల్లల్ని దగ్గరగా చేర్చేకొన్ని కార్యక్రమాలు.

మన వాతసుతునికి ఈ అలవాట్లన్నీ ఉండడం వల్ల అతనొక హీరోగా వెలుగుతున్నాడు. ఈ రోజుల్లో ఉందో లేదో తెలియదుగాని, పాతరోజుల్లో అన్ని బస్సుల్లో 'పొగత్రాగరాదు' అనీ, చెయ్యి, తల బైట పెట్టకూడదని సూచనలు రాసిపెట్టి ఉండేవి. అప్పుడు కొందరు తమాషాకు చేతులు, కాళ్ళు బైట పెట్టకూడదు' అని చెప్పుకుని నవ్వుకునేవాళ్ళు. కానీ ఈ రోజుల్లో సీట్లు ఖాళీగా ఉన్నా కూడ కొందరు కాలేజీ కుమారులు, ఇతర యువకులు ఫుట్ బోర్డులోనే ప్రయాణం చేస్తారు. వాళ్ళల్లో కొంతమందికి ఒక చెయ్యి, ఒకకాలు మాత్రమే ఫుట్‌బోర్డు మీద ఉంటాయి. మిగిలిన ఒకచెయ్యి, ఒకకాలు, ఒకశరీరం, ఒకతల బైటికి వేలాడుతూ గాలి కౌగిలిని అస్వాదిస్తుంటాయి. వాళ్ళు అలా ఎందుకు చేస్తుంటారో అన్న విషయం కనిపెట్టడం గొప్పమనో విశ్లేషకులకు కూడ సాధ్యంకాదేమో. బహుశా మూడు పెగ్గులు విస్కీ తాగినప్పుడు వచ్చే కిక్కు ఆ వేలాడడంలో వస్తుందేమొ. పాతరోజుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణం నిషేధం. అక్కడ నిలబడే స్వాతంత్ర్యంగాని, హక్కుగాని, అధికారం గాని ఒక్క కండక్టరుకే ఉండేది. పాతరోజుల్లో కదిలే బస్సులో ఎగిరి ఎక్కకూడదు అన్న సూచన ఉండేది. కానీ ఈ రోజుల్లో ఎక్కువమంది అపనే చేస్తున్నారు. అదే విధంగా బస్సు ఆగిన తరువాత బస్సు దిగకుండ ఆగకముందే దూకుతారు. తమకు దిగవలసిన చోటు దగ్గరకు వస్తుండగానే ఆ బస్సును 'ఓవర్‌టేక్' చేస్తున్నట్లు శరవేగంగా దూకి పరుగెత్తుతారు. ఢిల్లీలో మామూలు స్త్రీలు మాత్రమే కాక గర్భిణీ స్త్రీలు కూడ సర్కస్ ఫీట్స్ చేస్తున్న రీతిలో పరుగెత్తుతున్న బస్సులోకి టిఫిన్ కారియర్ లేదా బాక్స్, గొడుగు, వానిటీ బాగ్ వంటి వాటిని పట్టుకునిగెంతి ఎక్కడాన్ని చూస్తూ నిలబడితే వాళ్ళులోపలికి సురక్షితంగా చేరే వరకు మన హృదయ స్పందనం ఆగిపోవచ్చు.

ఈ మధ్య ఒకసిటీబస్సులో ఇద్దరు కాలేజీ కుర్రవాళ్ళు ప్రయాణిస్తున్నారు. వాళ్ళు దిగవలసిన చోటు దగ్గరవుతున్నపుడు మెల్లగా పోతున్న బస్సునుంచి ప్రయాణం అలవాటు ఉన్న అబ్బాయి బైటికిదూకాడు. దాన్నిచూచి అలవాటు లేని రెండోవాడు కూడ ఆస్నేహితుని వైపేదూకాడు. అంటే బస్సు ముందుకు వెళ్తుండగా వెనక ఉన్న స్నేహితుని వైపు దూకాడు. అందువల్ల బాలన్సు తప్పి రోడ్డు మీద పడి దొర్లిన ఆకుర్రవాడి శరీరంలో ఏమేమి పగిలాయో, ఏమేమి విరిగాయో అతనికీ, దేవుడికీ తప్ప ........ఒకే ఒక ఎముకల డాక్టరుకు మాత్రమే తెలుసు. ''ఆగకుండా పరుగెత్తే బస్సులు వర్ధిల్లాలి'' అని ఆ ఎముకల వైద్యుడు ఎముక లేని అతని నాలుకతో లేదా మనసుతో మంత్రించి ఉంటాడు. మన పవన పుత్ర ప్రసాద్ పరుగెత్తి వెళ్తున్న బస్సులో ఎగిరి ఎక్కడానికే కాక గెంతుతున్న బస్సులో పరుగెత్తి వెళ్లి ఎక్కడానికి కూడ సమర్థుడు. మామూలు బస్సులో

ఎక్కడం అతనికి ఇష్టంలేదు. పరుగెత్తి ఎక్కడానికి సౌకర్యంగా ఉండే డబుల్‌డెక్కర్ అంటేనే అతనికి ఇష్టం.

అలాంటి పెద్దవాహనంలో జనం పరుగెత్తి ఎక్కడానికే కాబోలు పెద్ద వరండాలాంటి ఫుట్‌బోర్డు పెట్టారు. తన గమ్యంవైపు ప్రయాణం చేస్తున్న ఒకడబుల్‌డెక్కర్ బస్సు తన దగ్గర వచ్చి ఆగడం; దాన్నుంచి జనం దిగడం; మరి కొందరు దానిలోకి ఎక్కడం జరుగుతున్నపుడు మన హీరోనోట్లో ముప్పయి రెండు పళ్ళు తప్ప వేరే ఏం లేకున్నా, చూయింగమ్ లోపల ఉన్నట్లు నెమరు వేస్తూ అటు ఇటు చూస్తూ నిలబడడం గాని లేక బస్సులో ఉన్న వాళ్ళందర్నీ చాలా సీరియస్‌గా సర్వేచేయడంగాని, చేస్తూ ఉంటాడు. బస్సు కదిలినతరవాత రెండు మూడు నిమిషాలకు, వెనక రెండుకాళ్ళు విరిగి పోయినా ముందు కాళ్ళతో పారిపోవడానికి ప్రయత్నిస్తున్న ఒక ఎలుకను వెక్కిరింత, తేలికభావం మిళితం చేసిచూస్తూ కూర్చున్న ఒక మార్జాలం లాగా అతను చూస్తూ ఉంటాడు. తరవాత అతను మెల్లగా పరుగెత్తడం మొదలు పెడతాడు. బస్సు పట్ల సంతోషంతో చేస్తున్న అతని పరుగుచూస్తే. ఆ బస్సుకు ఇంకాకొంచెం 'హండీ కాప్'ను అనుమతిస్తున్నట్లు అనిపిస్తుంది. ఆ బస్సు స్పీడు పెరుగుతున్న కొద్దీ అతని కాళ్ళకు మారథాన్ పరుగు నుంచి 800 మీటర్ల పరుగుకు తరవాత ఒక వందమీటర్ల స్ప్రింట్ పరుగుకు ప్రొమోషన్ వస్తుంది. చివరగా పారిపోవడానికి ప్రయత్నిస్తున్న ఒక జింకమీద ఎగిరి పడుతున్న ఒక పెద్దపులి మాదిరి ఒకే ఒక్క జంప్‌తో బస్సులోపలికి చేరినా కూడా ఒకకాలు, ఒక చెయ్యి, బాహ్యదిశను చూపిస్తూనే ఉంటాయి. ఈ రకంగా బస్సును ఎప్పుడు అతను వదలాలన్నా బస్సు ఆగడం గురించిగాని దాని స్పీడు తగ్గడం గురించి గాని అతను ఎప్పుడూ వెయిట్ చేసేవాడు కాదు. ఇలాంటి జంప్‌లకు, రేసులకు పనికివచ్చే 'యాక్షన్' షూస్‌లాంటి కాన్వాస్ పాదరక్షలు మాత్రమే అతను ధరించేవాడు. నిజాంకాలేజీలో బి. ఎ. ఫస్టియర్ చదువుతున్న ఒక అందమైన అమ్మాయి చాందిని. ఆమె మలక్‌పేట నివాసి కావడం వల్ల ప్రతిరోజూ ఆమె ప్రయాణం చేసే బస్సులోనే మన పవన పుత్రప్రసాద్ కూడ ఉంటుంటాడు. మామూలుగా అమ్మాయిలను టీజ్‌చేసే అలవాటున్న ఆ యువకునికి ఏ కారణం చేతో ఆ అమ్మాయిని టీజ్ చెయ్యాలని ఒక్కసారి గూడ అనిపించలేదు. ఆమెను చూచినప్పుడల్లా ఆమెను ఆదరించాలని గాని, పూజించాలని గాని, ప్రేమించాలని గాని అతనికి అనిపించేది. ఆమెను ఎవరు అల్లరి పెట్టాలనుకున్నా అతడు సహించలేడు. అతను దాదాపు ఆమెకు అంగరక్షకుడుగా అయిపొయ్యాడు. ఆమె గురించి చిన్న చిన్న పోట్లాటలకు, కొట్లాటలకు కూడ దిగేవాడు. ఆమెను ఎవరయినా కన్నెత్తిచూస్తే పవనపుత్రప్రసాద్‌కు అతనిపై పిచ్చికోపం వస్తుందని అందరికీ తెలియడం వల్ల ఆమెకు స్ట్రీట్ రోమియోల నుంచి గాని, కాలేజీ రోమియోల నుంచిగాని ఎలాంటి బాధ కలిగేది కాదు. మెల్ల మెల్లగా ప్రసాద్ - చాందినీలు

దగ్గరయ్యారు. తరవాత అతన్ని ఆమె రహస్యంగా బే-నజీర్ అని పిలవడం మొదలు పెట్టింది. దానికి కారణం ఏమని ఆమెనడిగితే గిలకను వాయించినట్లు కిలకిలా నవ్వేదిగాని జవాబిచ్చేది కాదు. ఆఖరికి అతని స్నేహితుల్లో, కొంచెం లోకజ్ఞానం ఎక్కువగా ఉన్న ఒకడు దాన్ని 'కోడ్' చేసి చెప్పాడు. బే-నజీర్ నాయకత్వం వహిస్తున్న పార్టీ పేరు పి.పి.పి కదా, మన హీరో కూడ పి.పి.పి. నేకదా! అంటే పవనపుత్ర ప్రసాద్ కదా !

ఆ తరువాత ప్రసాద్ చాందినీని చూచినప్పుడు ఒకసారి చాలా సంతోషంతో అన్నాడు.

''నన్ను పిపిపి అని ఎందుకు పిలుస్తున్నావో నాకర్థమయింది. 'పర్మనెంట్ లీ ప్రగ్నంట్ ప్రైమ్ మినిష్టర్' అనే కదా! అలా పిలవటానికి నాకు పెద్ద పొట్ట ఏమీ లేదే! ''

మామూలుగా సిగ్గు పడే అలవాటు లేని చాందినీకి ఆ సమయంలో ఎక్కడ్నించో కొంచెం సిగ్గు వచ్చింది. ఆ తరువాత ఆ పేరుతో ఆమె అతన్ని పిలవలేదు. అయితే హిందీ దూరదర్శన్ స్టైల్లో ఆమె అతన్ని 'పుత్తర్' అని పిలవడం మొదలు పెట్టింది. దాని అర్థం గార్దభపుత్రుడని ఇంకా సున్నితంగా చెప్పాలంటేగాడిద కొడుకని ఆ లోకజ్ఞాన దురంధరుడు చెప్పినా పవనుడు ఆ అర్థాన్ని స్వీకరించలేదు.

పరుగెత్తు తున్న బస్సులో ఎగిరి ఎక్కడం అపాయకరమని ఎన్నో సార్లు ఆమె ఉపదేశించినా ఆ అలవాటు ఆపడం గాని, కొంచెం తక్కువ చేయడంగాని అతను చేయలేదు. ఒకరోజు ఆ విషయం మీద ఆమె కొంచెం సీరియస్ గా మాట్లాడింది.

''నేనంటే చాలా ఇష్టం అంటావు కదా ! మరి నేను చెప్పిన ఒక చిన్న మాట ఎందుకు వినవు ?'' అని ఆమె అడుగుతున్నపుడు.''

''చాందిని చెప్పేది ఏదయినా నేను చెయ్యడానికి సిద్ధమే. విషం తాగమంటే తాగుతాను.. వెళ్ళే బస్సుముందు పడమంటే పడతాను... కానీ ఇది నా పాత అలవాటు కదా... అంతేకాదు..... వీళ్ళు బస్సును ఎక్కడయినా సరిగా ఆపుతారా ? మనం బస్టాపులో నిలబడితే వాళ్ళు ఒకఫర్లాంగు అవతలగాని, ఇవతల గాని ఆపుతారు. అంతదూరం పరుగెత్తి చేరేటప్పటికి బస్సు టాప్ గేర్‌లో వెళ్తూంటుంది'' అని తనను తాను సమర్థించుకున్నాడు.

''నో... అదంతా నిజంకాదు. నేను ఎప్పుడూ పరుగెత్తి బస్సు ఎక్కలేదే. అప్పుడప్పుడు బస్సుమిస్ కావచ్చు. అందుకే నేను ఉదయం కొంచెం తొందరగానే ఇంటినుంచి బయల్దేరుతాను. ఒకటి రెండు బస్సులు ఆగకపోతే కూడ నేనింత వరకు క్లాసుకు ఆలస్యంకాలేదు.

అందమైన అమ్మాయిల్ని చూడగానే డ్రైవర్ల కాలు ఆటోమాటిక్ గా బ్రేక్ మీద పడుతుంది. ఒకవేళ డ్రైవర్ రిటైర్మెంటు దగ్గర పడిన ముసలివాడయితే, యువకుడయిన కండక్టర్ బెల్లుగాని, విజిల్‌గాని కొట్టి ఆపుతాడు. వాళ్ళకు మీరే కదా అసలయిన

విఐపిలు.

''అయితే నేను చెప్పిన మాట మీరు వినరు అంతేకదా !''

''కాదు కాదు ... కానీ ... దాదాపు అందరు మగవాళ్ళు ఇలా పరుగెత్తి బండి ఎక్కడం, దిగడం మామూలేకదా ! ఇంక నేనయితే భయపడాల్సిన అవసరంలేదు''

''ఏంటి ? పుత్తర్‌కు తలమీద మూడు కొమ్ములున్నాయా ?''

''దానికంటె గొప్పదే కదా నాదగ్గరుండేది ?''

''అదేమిటి?''

''అది..చాందిని ప్రేమ అనే రక్షకవచం .... ఆ రక్షా సూత్రం నాదగ్గర ఉన్నంతకాలం నాకే అపాయం జరగదని నాకు పూర్తి నమ్మకం ఉంది.

''అయితే ఆ రక్షకవచాన్ని నేను ఇప్పుడే వెనక్కు తీసుకుంటున్నా... పుత్తర్ బుద్ధిగా ప్రవర్తించినపుడే తిరిగి ఇస్తాను''.

''అయ్యో ! చాందినీ ! అలా వద్దు ! అలావద్దు! ఆ రక్షకవచం లేకుండ ఒక్కరోజు బ్రతకడం నాకు సాధ్యం కాదు....ప్లీజ్ ... ప్లీజ్... ప్లీజ్..డోన్ట్ విత్‌డ్రా.''

''నో....నో....ఇటీజ్ ఆల్‌రడీ విత్‌డ్రాన్.... ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా మంచి అలవాట్లు నేర్చుకోండి... ఆ తరవాతే నేను అది తిరిగి ఇస్తా ......బై.....బై...'' అని చెప్తూ ఒక చిరు నవ్వుతో ఆమె వెనక్కుతిరిగి వెళ్ళిపోయింది. ఆరోజు సాయంత్రం చాందిని కేలేజీ నుంచి తిరిగి వెళ్ళే డబుల్ డెక్కర్ బస్సులో అతను పరుగెత్తకుండ ఎక్కాడు. ఆమె దిగేటప్పుడు అతనికి ఒక చిరునవ్వు ప్రసాదించి వెళ్ళింది.

మర్నాడుదయం అతను ఆమె బస్టాప్ వరకు వచ్చి ఆమెకోసం వెయిట్ చేశాడు. ఆమె వచ్చింది. డబుల్ డెక్కర్ బస్సుకూడ వచ్చింది. ఆమె బస్సులో ఎక్కడాన్ని, ఒక సీటులో కూర్చోడాన్ని అతను చూస్తూ నిలబడ్డాడు. అతని ముఖంలో చిన్న చిరునవ్వు మెదిలింది. ఆమె అతని వైపు చూస్తూ కూర్చుంది. బస్సుకదిలింది. అతనిలో ఎలాంటి చలనం లేదు.

'దేవుడా ! నిన్న ఎంతగా చెప్పాను...నిన్న బుద్ధిగానే ఎక్కాడు.. ఈరోజు మళ్ళీ చూశారా ! కుక్కతోక ఎంత సరిచేసినా వంకరే ! బస్సు ఇంత కదిలాక కూడ అతనిలో చలనం లేదే !' అని ఆమె ఆందోళన పడింది.

పవన పుత్ర ప్రసాద్ నడక ఇప్పుడు నెమ్మదిగా మొదలయింది. అది మెల్లగా పరుగులోకి మారింది. అంతలోపల బస్సు టాప్ గేరునందుకుంది. ఇప్పుడు అతను పి.టి. ఉషను ఓడించేపరుగు లఘించుకున్నాడు. బస్సుకు చాలా దగ్గరగా వచ్చాడు. మరుక్షణంలో అతను

బస్సులోపల ఉంటాడు అని చాందిని అనుకుంటోంది. కానీ..

బస్సులో స్టీల్ బార్‌ను పట్టుకుని అతనులోపలికిగెంతడం పెద్ద సౌండుతో బస్సు సడన్ బ్రేకు కొట్టి ఆగడం, ఒకేసారి జరిగింది. బస్సులో ఉన్నవాళ్ళు ఎక్కువ మంది వాళ్ళ ముందు సీటువాళ్ళ మీద పడ్డారు. కొంతమంది సీట్ల మధ్యలో పడిపోయారు. ఆకస్మికంగా ఒక సైకిల్‌వాడు బస్సు ముందుకు రావడం వల్ల డ్రైవర్‌సడన్ బ్రేక్ కొట్టవలసి వచ్చింది. కొంచెం ఉలికి పడిన ఆ సైకిల్‌వాడు చాలా ఫాస్ట్‌గా పారిపోయాడు. ''అబ్బ! నాకేం జరగకుండ దేవుడు కాపాడాడు'' అనుకుంటూ.. అంతలో పవన వేగంతో, పరుగెత్తి వచ్చిలోపలికి గెంతిన పవన పుత్ర ప్రసాద్‌కు ఏం జరిగింది ? లోపలకి అతను గెంతడం, బస్సు ఆగడం ఒకేసారి జరగడం వల్ల అతని తల, శరీరం బస్సులోపలి గోడలాంటి భాగానికి చాలా గట్టిగా కొట్టుకున్నాయి. అతని శరీరం ఒక ఉతక్కు వేసినగుడ్డల మూటలాగా బస్సులో కిందపడి దొర్లుకుంటా రోడ్డుమీదపడింది. బస్సు పూర్తిగా ఆగడంవల్ల షాక్‌నుంచి బయట పడ్డ కొంతమంది ప్రయాణీకులు అరుచుకుంటూ పవన పుత్ర ప్రసాద్ దగ్గరికి పరుగెత్తారు. బిగ్గరగా ఏడుస్తూ చాందినీ కూడ బైటికి వచ్చింది. పవన పుత్ర ప్రసాద్ స్పృహ లేకుండా పడి ఉన్నాడు. తలలోంచి, ముక్కులోంచి, విరిగిన ఒక చేతినుంచి రక్తం కారుతోంది. ముఖానికి ఎడమవైపు చాలావరకు చితికి పోయింది.

వెనకనుంచి వస్తున్న ఒక కారును జనం ఆపారు. సొంతదారునడిపిస్తున్న ఒక ఎంబాసిడర్ కారు అది. దాని వెనక సీటులో పవనపుత్ర ప్రసాద్‌ను పడుకోబెట్టారు. చాందినీ, బస్సులో ఉన్న ఇంకో విద్యార్థి కూడ ఆకారులో ఎక్కారు. అతివేగంగా ఆ కారు ఉస్మానియా ఆసుపత్రికి చేరింది.

''పవన్ పుత్ర ప్రసాద్ ఈజ్ అవుట్ ఆఫ్ డేంజర్'' అనేదే లేటెస్ట్ మెడికల్ బులెటిన్.

అతనికి స్పృహవచ్చింది కాని శస్త్రక్రియానంతర దీర్ఘ సుషుప్తిలో ఇప్పుడు ఉన్నాడు.

'తనప్రేమ అనే రక్షాకవచాన్ని తాను వెనక్కుతీసుకున్నాను' అన్నమాటలు చాందినీ చెవుల్లో గింగురు మంటున్నాయి. బస్సు వెలుపల రోడ్డులో రక్తపుమడుగులో చలన రహితంగా అతను పడి ఉన్న ఆదృశ్యం ఆమె కళ్ళముందు మసకబారలేదు. ఆ అపాయానికి పవనపుత్ర ప్రసాద్ స్వయంగా కారకుడని ఆమెకు నమ్మడం సాధ్యం కాలేదు. ఇంక ఎంతకాలం తన్నుతాను... శపించుకుంటూ దుఃఖంలో మునిగి ఉండాల్సి వస్తుందో ఆ భగవంతుడికే తెలుసు.

**(18-9-1994 ఉదయం ఆదివారం సంచికలో ప్రచురితం)**